క్లుప్తంగా

27వ మండల సర్వసభ్య సమావేశం

నాతవరం : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 27వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీవో కె.ఉషశ్రీ అన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు విధిగా హాజరు కావాలన్నారు. అలాగే మండల స్థాయిలో గల అన్ని శాఖలు అధికారులు అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలకు సంబంధించి పూర్తి సమాచారంతో విచ్చేయాలన్నారు.

చోరీలపై అప్రమత్తం



వడ్డాదిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట : గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించి దొంగతనాలు జరగకుండా సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు. సోమవారం రాత్రి వడ్డాది జంక్షన్‌లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద వ్యాపారులు, ప్రజలతో సమావేశమై అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి సహకరించాలని అన్నారు. ఇటీవల మండలంలో పలు ఆలయాల్లో దొంగతనాలతో పాటు పలువురి వాహనాలు చోరీ సంఘటలను ప్రస్తావిస్తూ ఆయన ప్రజలకు సీసీ కెమెరాలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

పెరుగుతున్న కోనాం నీటిమట్టం



కోనాం జలాశయం

చీడికాడ : ఇటీవల అల్పపీడన ప్రభావంతో ఏజేన్సీలో కురిసిన వర్షాలకు మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకు స్వల్పంగా పెరుగుతుంది. వివరాల్లోకి వెళితే జలాశయం నీటిమట్టం ప్రమాదస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా సోమవారంనాటికి 96.30 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా దిగువకు 40 క్యూసెక్కులు విడుదలౌతుంది. వరి కోతలు ముగియడంతో ఆయకట్టు పరిధిలో రైతులు వేరుశనగ, అపరాల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జలాశయంలో నీటిమట్టం పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమౌతుంది.

భక్తిశ్రద్ధలతో మేల్కొలుపులు



రోలుగుంటలో పల్లకీపై ఊరేగిస్తున్న విష్ణుమూర్తి, గోదాదేవిలను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట : ఈ నెల 16 న ప్రారంభమైన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కూడా స్థానిక శ్రీ సిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో కొనసాగాయి. గ్రామంలో విష్ణుమూర్తి, గోదాదేవిల చిత్రపటాలతో చేపట్టిన రథోసేవ సోమవారం కొండపాలెం చేరుకుంది. ఊరేగింపులో భజన బృందం భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ మేల్కొలుపుల కార్యక్రమం వచ్చే నెల భోగి వరకూ సాగుతుందన్నారు. భక్తులు అందించిన కానుకలతో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కె.జె.పురం హైస్కూల్లో రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళులు

మాడుగుల రూరల్ : గణితశాస్త్రంలో పలు ప్రయోగాల ద్వారా ప్రపంచ దేశాలకు మార్గం చూపిన మహోన్నత వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని కె.జె.పురం హైస్కూలు హెచ్ఎం వి.దాసు పేర్కొన్నారు. రామానుజమ్ 137 వ జయంతి పురస్కరించుకుని, కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దేవి మాట్లాడుతూ గణితశాస్త్రంలో రామానుజన్ ప్రాముఖ్యత వివరించారు.



మూతపడిన కొత్తమల్లంపేట కేంద్రం

తుప్పల్లో ఏఎల్‌పురం చెరకు తూనిక కేంద్రం

బోసిపోయిన తూనిక కేంద్రాలు

- చెరకు పంటపై ఆసక్తి చూపని రైతులు
- గతంలో ఏటా 15వేల టన్నుల చెరకు సరఫరా
- ప్రస్తుతం మూతపడిన కేంద్రాలు

గొలుగొండ : ఒకప్పుడు చెరకు సాగుకు ఎంతో పేరున్న గొలుగొండలో ఇప్పుడు చెరకు సాగు చేయాలంటే రైతులు ఆసక్తి చూపడం లేదు. ప్రతి ఏటా 15వేల టన్నులు సరఫరా చేసే తూనిక కేంద్రాలు ప్రస్తుతం నిర్మాణుష్యంగా ఉన్నాయి. చెరకు సాగు చేసే రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు కల్పించడంతో విఫలం కావడంతో ఈ సాగు చేయాలంటే బయపడుతున్నారు. పెరిగిన పెట్టుబడులు చూసి రైతులు సాగు చేయడం మానుకున్నారు

గతంలో 15 వేల టన్నుల చెరకు సాగు సరఫరా

మండలంలో కొత్తమల్లంపేట, ఏఎల్‌పురం చెరకు తూనిక కేంద్రాలు నుండి 15 వేల టన్నులు చెరకు సరఫరా జరిగేది.కొత్తమల్లంపేట, కొంకసింగి, నాగాపురం, బోద్యం, లింగంపేట, గొలుగొండ, చిన్నయ్యపాలెం, అమ్మపేట గ్రామాల్లో 90శాతం మంది రైతులు చెరకును పండించేవారు. ఈ రెండు చెరకు తూనిక కేంద్రాలు ద్వారా ఏటికొప్పాక చెక్కర కర్మాగానికి చెరకు సరఫరా చేసేవారు. అలాంటి పేరున్న ఈచెరకు తూనిక కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి.

గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

చెరకు సాగు చేసే రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఈ సాగుపై రైతులు ఆసక్తి చూపలేదు. 2014–19 మధ్యలో చంద్రబాబు ప్రభుత్వం చెరకు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. అప్పట్లో చెరకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేయడంతో విసుగు చెందిన రైతులు సాగు మానుకున్నారు. దీంతో అప్పట్లో ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగ్గిపోవడం జరిగింది.

పెరిగిన పెట్టుబడులు

చెరకు రైతులు ఈ ఏడాది టన్నుకు రూ.2900 ధర కల్పించడం జరిగింది. అయితే పెరిగిన కూలి రేట్లు, పెట్టుబడులు వల్ల ఎకరం సాగు చేసిన రైతుకు నష్టమే మిగులుతుంది. దీంతో రానురాను సాగు చేయడం మానుకున్నారు. మండలంలో ఒకప్పుడు ఎంతో మేరున్న ఈ సాగు ఇప్పుడు 4శాతం కూడా చెరకు సాగు చేయడం లేదు. దీంతో ఈ తూనిక కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. చెరకు రైతుపై చంద్రబాబు ప్రభుత్వం చిరుకన్ను వేయడంతోనే సాగు చేయలేకపోతున్నామని రైతులు తె లుపుతున్నారు. దీంతో ఏటికొప్పాక చక్కర కర్మాగారం సైతం మూతపడ్డాయి. ప్రస్తుతం అక్కడక్కడ సాగు చేస్తున్న పంటను గోవాడ కర్మాగానికి రైతులు సరఫరా చేస్తున్నారు.

గిట్టుబాటు ధర లేక



చెరకు సాగు చేస్తున్న రైతుకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించలేదు. దీని వలన రైతులు సాగు చేయడం మానుకుంటున్నారు. ఒకప్పుడు చెరకు సాగు ఎంతో ఆసక్తిగా చేసేవాళ్లం. 2014–19 మధ్య కాలంలో చెరకు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేమెంట్లు సక్రమంగా ఇవ్వకపోవడంతో అప్పులు పాలై పోయాం

– పడవాడ నూకినాయుడు, లింగంపేట, రైతు

పెట్టుబడులు తట్టుకోలేక



చెరకు సాగు కనీస మద్దతు ధర టన్నుకు రూ.4వేల వరకు ఇస్తే బాగేండేది. కానీ టన్నుకు రూ.2900 ఇవ్వడం వల్ల కనీసం పెట్టుబడులు మాట పక్కన పెడితే నష్టాలు వస్తున్నాయి. కూలి రేట్లు, ఎరువులు, పురుగుమందులు ధరలు ప్రతి ఏటా పెరగడం, మద్దతు ధర లేకపోవడంతో చెరకు రైతులు పరిస్థితి దయనీయంగా మారింది.

– నారాయణమూర్తి, రైతు, గొలుగొండ

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

నేటి నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

చోడవరం : క్రిస్మస్ వేడుకల సందడి మొదలైంది. ఒక పక్క సెమీ క్రిస్మస్ వేడుకలతో గ్రామాల్లో సందడి నెలకొనగా మరో పక్క క్రిస్మస్ పండుగవేడుకలకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. పండగ సంబరాలతో మార్కెట్లలో షాపులన్నీ బిజీగా మారాయి. రెండు నియోజకవర్గాలకు ప్రధాన కేంద్రమైన చోడవరం పట్టణంలో క్రిస్మస్ పండగ కొనుగోళ్లతో వస్త్రదుకాణాలు, స్టార్లు, విద్యుత్ అలంకరణ సామాగ్రి దుకాణాలు రద్దీగా మారాయి. మరో పక్క ఈనెల 25వతేదీన క్రిస్మస్ పండగ కావడంతో చర్చిలన్నీ విద్యుత్ దీపాలంకరణతో కనువిందు చేస్తున్నాయి. పురాతన ప్రార్ధనామందిరాలైన చోడవరం గాంధీగ్రామం ఆర్‌సీఎం, బాప్టిస్టు చర్చిలతోపాటు గోవాడ, వెంకన్నపాలెం,గౌరీపట్నం పలు గ్రామాల్లో ఉన్న చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. క్రీస్తు ప్రార్ధనా మందిరాల్లో రోమన్ కేథలిక్ చర్చి(ఆర్‌సీఎం) అత్యంత ముఖ్యమైనది. ఏసుక్రీస్తే స్వయాన తన శిష్యులతో ఈ ప్రార్ధనా మందిరాన్ని నిర్మించారని చర్చి ఫాదర్లు చెబుతుంటారు. ఆర్‌సీఎం చర్చిలను క్రీస్తురాజు దేవాలయాలు అని కూడా అంటారు. అటువంటి ఆ శాఖకు చెందిందే చోడవరం సమీపంలో గాంధీగ్రామంలో ఉన్న ఆర్‌సీఎం చర్చి. ఈ ప్రార్ధనా మందిరాన్ని స్థాపించి సుమారు 34 యేళ్లు దాటింది. ఈ దేవాలయంలో పాస్టర్లు కాకుండా ఫాదర్లు ప్రార్ధనలు చేస్తారు. భక్తులు తమ పాపాలను ఫాదర్ల దగ్గర చెబితే ఆ దేవునికి చెప్పుకొని పరివర్తన చెందినట్టుగా భావిస్తారు. పవిత్ర, ప్రశాంతతకు ఈ ఆలయం పెట్టింది పేరుగా చెబుతారు. ఇంతటి విశిష్టత కలిగిన ఆర్‌సీఎం చర్చిలో ఈ ఏడాది క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. చర్చిని సర్వాంగ సుందరంగ రంగులు వేసి తయారుచేశారు. ఆలయ ప్రాంగణాల్లో ఒక పాకను రూపొందించి అందులో క్రీస్తు జననానికి సంబంధించిన ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఈనెల 24వతేదీ అర్ధరాత్రి 12గంటల నుంచి అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనా కార్యక్రమాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. లోక రక్షకుడైన క్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్‌ను పురస్కరించుకొని దివ్య బలిపూజ(పవిత్రమైన ఆరాధన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చర్చి ఫాదర్లు తెలిపారు. అదేవిధంగా చోడవరం ద్వారకానగర్‌లోని ఇమ్మానియల్ చర్చి, వెంకన్నపాలెం, అంబేరుపురం, గోవాడ, గౌరీపట్నం, జన్నవరం, లక్కవరం, నర్సాపురం, గంధవరం, శీమునాపల్లి, బెన్నవోలు, వడ్డాది, దామునాపల్లి తోపాటు అన్ని గ్రామాల్లో ఉన్న క్రైస్తవ చర్చిలన్నీ ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు.



క్రిస్మస్ సందర్భంగా దుకాణాల్లో విక్రయిస్తున్న స్టార్లు, ఇతర సామగ్రి



గాంధీగ్రామంలో ఆర్‌సీఎం చర్చి



మాకవరపాలెంలో విద్యుద్దీపాలంకరణతో చర్చి కళకళ

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

మాకవరపాలెం : క్రిస్మస్ పండగకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఈ మేరకు బుధవారం క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పల్లెల్లో క్రిస్మస్ సందడి మొదలైన నేపథ్యంలో ఉపవాసాలు ఉంటూ గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవ సోదరుల ఇళ్లతోపాటు చర్చిలపై రంగురంగుల క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేయడంతో ఎంతో ఆకట్టుకుంటున్నాయి. చర్చిలకు కూడా భారీ విద్యుత్ దీపాలంకరణ చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొండలఅగ్రహారంలో ఉన్న ఇమ్మానియేలు చర్చిలో కూడా సంస్థ అధినేత బిషప్ జీవన్‌రాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాటు చేశారు.

నాగయ్యపేటలో జీవీఎంసీ కాలువకు గండి



జీవీఎంసీ కాలువ నుంచి నీరు ప్రవహించడంతో పంటపొలాల్లోకి చేరిన నీరు



జీవీఎంసీ కాలువకు గండి పడి ప్రవహిస్తున్న నీరు

పొలాల్లోకి నీరు ప్రవేశించడంతో తడిసిన పంటలు

దేవరాపల్లి : రైవాడ జలాశయం నుండి జీవీఎంసీకి తాగునీటిని సరఫరా చేసే కాలువకు నాగయ్యపేట, వావిలపాడు గండి వారి కల్లాల మధ్య రంధ్రం పడింది. దీని ద్వారా నీరు పంట పొలాల్లోకి ప్రవేశించడంతో పంట పొలాల్లో కోసిన వరి పనలతో పాటు వరి కుప్పలు, మినప పంట తడిసిపోయి దెబ్బతింది. సుమారు 100 ఎకరాల మేర నీరు చేరి పంటలు నీట మునిగాయి. సోమవారం ఉదయం కాలువకు రంధ్రం పడినప్పటికీ జీవీఎంసీ కాలువ పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ సిబ్బంది ముందుగా స్పందించి ఉంటే ఇంత నష్టం ఉండేది కాదన్నారు. రైతుల ఆందోళన తీవ్రతరం కావడంతో జీవీఎంసీ సిబ్బంది సోమవారం సాయంత్రం తిరిగ్గా వచ్చి రంధ్రం పూడ్చారు.

శివాలయానికి మైక్‌సెట్ వితరణ

నాతవరం : సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరిలో దైవ సంకల్పం ఉండాల్సిన అవశ్యకత ఉందని శ్రీశివ శక్తి క్షేత్రం భూగర్భ శివాలయం ఆలయ ధర్మకర్త సీతారామశర్మ అన్నారు. గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామంలో వెలసిన శ్రీ శివ శక్తి క్షేత్రం భూగర్భ శివాలయానికి రాష్ట్ర బీసీ కార్పోరేషన్ డైరెక్టరు రాజాన వీర సూర్యచంద్ర రూ.30వేలతో మైక్ సెట్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీతారామశర్మ మాట్లాడుతూ ఇక్కడ శివాలయంలో ఒకే ఆవరణలో 63 దేవాలయాలు, 120 ఉపాలయాలు, 150 దేవతామూర్తులతో ప్రపంచంలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. శివాలయానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్న వీర సూర్యచంద్రను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జీడిపిక్కల పరిశ్రమ యాజమాని వెలగా కృష్ణారావు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.



ధర్మకర్త సీతారామశర్మకు మైక్‌సెట్ అందజేస్తున్న రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర

విద్యాసామగ్రి వితరణ

దేవరాపల్లి : పాత వాలాబు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు విద్యా సామాగ్రిని సమకూర్చారు. శ్రీ సత్య సేవా సంస్థ ప్రతినిధులు రావాడ శశిభూషణరావు, ఆదిరెడ్డి చినకన్నంనాయుడు తదితరులు 32 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లతో పాటు టూత్ బ్రష్, టూత్ పేస్ట్, పౌడర్ తదితర సామాగ్రిని వితరణ చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.దండుమనాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ వరలక్ష్మి సమక్షంలో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఆదిరెడ్డి చినకన్నబాబు చేతుల మీదుగా సోమవారం అందజేశారు. హెచ్ఎం దండునాయుడు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాణాల రాంబాబు పాల్గొన్నారు.



సత్యసాయి సంస్థ ప్రతినిధులు అందించిన సామగ్రితో పాతవాలాబు విద్యార్థులు

ఉచిత శస్త్ర చికిత్సలకు రోగుల తరలింపు

మాడుగుల రూరల్ : మండలంలో రెండు గ్రామాలు నుంచి విశాఖ అనిల్ నీరుకొండ ఆస్పత్రికి వివిధ వ్యాధులు, శస్త్ర చికిత్సల కోసం రెండు బస్సుల్లో మండలం నుంచి సోమవారం బయలుదేరి వెళ్లారు. కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, కళ్యాణ వేంకటేశ్వర దేవాలయం చైర్మన్ రాపేట రామకొండలరావు ఆధ్వర్యంలో ఒమ్మలి గ్రామం నుంచి ఒక బస్సు, కె.జె.పురం గ్రామం నుంచి ఒక బస్సులో 56 మంది రోగులను తరలించారు. వారికి ఉచితంగా తనిఖీలు చెయించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించడానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి పెచ్చెట్టి కొండలరావు, ఉపాధ్యక్షుడు కరణం దేముళ్లు, సొసైటీ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది ఇన్నమ్మా, సురేష్, దుర్గారావు, దాలిరెడ్డి పాల్గొన్నారు.



కె.జె.పురం నుంచి అనిల్ నీరుకొండ ఆస్పత్రికి బయలుదేరిన బస్సు

సందడిగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ఆకట్టుకున్న విద్యార్థుల క్రీస్తు జనన ఘట్టం, శాంతాక్లాజ్ వేషధారణలు

కె.కోటపాడు : కె.కోటపాడులో గల అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు యేసు, శాంతాక్లాజ్, తదితరుల వేషధారణలో అలరించారు. వీటితో పాటు ఏసు జనన ఘట్టంతో పాటు క్రిస్మస్ గీతాలకు విద్యార్థుల చేసిన కృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు పలువురిని ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ కేక్‌ను కట్ చేయగా శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు తోటి విద్యార్థులకు కేక్‌ను పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, నూర్జహాన్, ఉపాధ్యాయులు సుమతి, పద్మిని, శ్రావణి, డేవిడ్ పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

మాకవరపాలెం: అన్ని మతాలను గౌరవించాలని మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం కె.రాము అన్నారు. ఈ పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ విశిష్టతతోపాటు క్రీస్తు బోధనలను విద్యార్థులకు వివరించారు. అందరినీ దయతో చూడాలని, క్షమాగుణం కలిగి ఉండాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం: మున్సిపాలిటీ వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందుస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ విద్యార్థులతో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులు అలరించారు. క్రిస్మస్ పండగ విశిష్టతకు విద్యార్థులకు తెలియజేసేందుకు క్రిస్మస్ వేడుకలను నిర్వహించామని గోపీనాథ్ పేర్కొన్నారు.



క్రిస్మస్ జనన ఘట్టంతో పాటు వేషధారణలో విద్యార్థులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



తూటిపాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

40 ఎకరాల్లో తడిచిన వరి పంట

కె.కోటపాడు : వర్షాల కారణంగా కోతలు చేసి మడుల్లో తడిచిన వరిపంటను రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది వివరించే జాగ్రత్తలను పాటించి పంటను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో సోమవారం తడిచిన వరిపంటను పరిశీలించారు. మండలంలో ఇటీవల వర్షాలకు 40 హెక్టార్‌లలో వరి పంట తడిచినట్టుగా ప్రాథమిక అంచనా వేసినట్టు ఆయన తెలిపారు. వరిపనలు మొక్క రాకుండా, ధాన్యం రంగు మారకుండా ఉండేందుకు లీటర్ నీటిలో 50 గ్రాముల కళ్ల ఉప్పును వేసి పనలపై పిచికారి చేయాలన్నారు. మండలంలో తడిసిన వరి పంటను ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నులైవున్నారు.

మాకవరపాలెం: వరుణుడు రైతులను పరుగులు పెట్టించాడు. వారం రోజులుగా తుపాను ప్రభావంతో వరి రైతులు కోసిన పంటను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో మళ్లీ మార్పులు చోటుచేసుకుని మబ్బులు కమ్ముకున్నాయి. పొలాల్లోనే ఉన్న వరి పనలను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు.

చీడికాడ : తడిచిన వరిపనులపై ఉప్పునీరు పిచికారి చేస్తే ధాన్యం రంగు మారకుండా ఉండడంతో పాటు గింజ మొలకెత్తదని వ్యవసాయాధికారి కృష్ణవేణి అన్నారు. సోమవారం మండలంలోని దండిసురవరం, బైలపూడి, తునివలస, వరహాపురం గ్రామాల్లో ఆమె తడిచిన వరి పనలను, చిన్న చిన్న వరికుప్పలను పరిశీలించారు. పలువురు రైతులతో మాట్లాడుతూ చిన్న బడిపేలుగా పెట్టిన వరిపనలలో కల్లుప్పు చల్లాలన్నారు. పైన ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు.



గొండుపాలెంలో వరిపనలపై ఉప్పద్రావణాన్ని పిచికారి చేయిస్తున్న వ్యవసాయాధికారి సోమశేఖర్



మాకవరపాలెం : వరికుప్పలు పెడుతున్న రైతులు



దండిసురవరంలో తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న ఏవో కృష్ణవేణి

వినతులన్నీ పరిష్కరిస్తాం

రోలుగుంట : రత్నంపేట, పనసలపాడులో సోమవా రం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇక్కడ పాల్గొ తహసీల్దార్ ఎస్.నాగమ్మ రైతుల నుంచి పలు రకాల భూ సమస్యలపై వచ్చిన వినతులు స్వీకరించారు. డీటీ శంకర్రావు, సర్వేయర్ తవుటునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ

మాడుగుల రూరల్ : మండలంలో ఎల్. పొన్నవోలు, ఎల్. కృష్ణాపురం గ్రామ రెవెన్యూ సదస్సులు సోమవారం పొన్నవోలు సచివాలయంలో నిర్వహించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై ఎల్.పొన్నవోలు నుంచి ఒక దరఖాస్తు అందజేశారు. తహసీల్దార్ రమాదేవి, రీసర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయరు జగదీష్, వీఆర్‌వో, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 11 అర్జీలు

కె. కోటపాడు: ఎ.కోడూరు, కె. కోటపాడు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కె.కోటపాడులో ఆరుగురు, ఎ.కోడూరులో ఐదుగురు వివిధ భూ సమస్యలపై అర్జీలు అందించారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు.